

# అద్వైతం – శారద (బ్రిస్బేన్)

## (క్రిందటి సంచిక నుంచీ కొనసాగింపు)

### 1993 డిసెంబర్

"అబ్బ, ఈ సంవత్సరం ఎంత తొందరగా, ఎంత ఈవెంట్‌ఫుల్ గా గడిచిపోయిందో కదా అశోక్?"

"అవును భానూ, అన్నిటికంటే పెద్ద అడ్వెంచర్ శివా పెళ్ళి. వాళ్ళ నాన్నగారొచ్చి మమ్మల్ని బాగా తిట్టారు."

"సూసీ వాళ్ళ అమ్మ మా ఇంటికొచ్చి మాకూ వొడ్డించింది. దాంతో అమ్మా, నాన్నా నా మీద కోప్పడ్డారు. అమ్మయితే నాన్నతో నా పెళ్ళి చేసేయమని బాగా గొడవ మొదలుపెట్టింది. అయితే నాన్న అమ్మ మాట కొట్టిపారేసారులే. వచ్చే యేడు వరకూ నన్ను డిస్టర్బ్ చేయొద్దని చెప్పారు. నువ్వు మళ్ళీ శివా వాళ్ళ ఇంటికెళ్ళావా?"

"మా ఇంటి దగ్గరే వాళ్ళ ఇల్లు. చిన్న ఇంట్లో హాయిగా వున్నారు. వొచ్చే యేడూ ఆస్ట్రేలియాకి వెళ్ళిపోవడానికి ప్రయత్నిస్తున్నాడు శివా. వాళ్ళ ఆఫీసు బ్రాంచీ ఒకటి మెల్బోర్న్‌లో పెడుతున్నారట. అక్కడ అవకాశం వొస్తే వెళ్తారేమో!"

"యేంటో, పెద్ద వాళ్ళమైపోతున్నామా అని బెంగగా వుంటుంది కొన్నిసార్లు."

"ఇరవై రెండేళ్ళకే? ఇంకా చాలా వుందమ్మాయ్ ముందర!"

"అప్పుడే ఇరవై రెండా? నేను మొన్ననే ఇంజినీరింగ్‌లో చేరా," యేడుపు మొహం పెట్టింది భాను.

"అది సరే, నీ ఉద్యోగం ఎలా వుంది? జీడి మెట్ల వరకూ రోజూ ఎలా వెళ్ళొస్తున్నావ్?"

"బస్సు బానే వుందిలే. కానీ మా ఆఫీసులో కొంచెం ఆడవాళ్ళకంత సౌకర్యంగా వుండదు. ప్లాంటులోకి వెళ్ళడానికి అసలు నా సైజు బూట్లుండవు తెలుసా? అన్నీ మగవాళ్ళ సైజుల్లోనే వుంటాయి. ఈ నెలలోనే నా సైజు బూట్లూ, పర్సనల్ ప్రొటెక్షన్  ఎక్విపెంటూ కొనడానికి డబ్బు సాంక్షన్ చేసారు."

"పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్విప్మెంటా? అంటే ఏమిటి?"

"అంటే కెమికల్ ప్లాంటుల్లో చుట్టూ వుండే రసాయనాలు మనకి హాని కలిగించకుండా, పైన ఒక కోటూ, తలపైన కేపూ, స్పెషల్ బూట్లూ వుంటాయి. వాటన్నిటినీ కలిపు పీపీఈ అంటారు. అవి చిన్న సైజుల్లో కొనమని యేడాదినుంచి అడుగుతూనే వున్నారట మా ప్లాంటులోని సీనియర్ ఇంజినీర్లు. అసలు ఆడ ఇంజినీర్లు ప్లాంటులోకి వెళ్ళడమే ఇష్టం వుండదు మా సీనియర్లకి. హాయిగా కంప్యూటర్ ముందు కూర్చొని కోడింగో, లేకపోతే అడ్మినిస్ట్రేషన్ పనో చేసుకోకుండా, మీ లేడీస్‌కెందుకు మేడం ఈ ప్లాంటులో పన్లు, అన్నాడు మొన్నొక జూనియర్ అసిస్టెంటు. తిక్క రేగింది నాకు. "

"మరి నువ్వు ప్లాంటులోకెళ్ళాల్సిన అవసరం యేమిటి?"

"ప్లాంటులో కెమికల్స్ తయారీ జరుగుతూ వుంటుంది. నేను అలా తయారైన కెమికల్స్‌ని క్వాలిటీ కంట్రోల్ చేస్తూ వుంటానన్నమాట."

"క్వాలిటి కంట్రోల్ ఎలా చేస్తావు? నోట్లో వేసుకొని.."

"చాల్లే నీ తెలివి! ఇదేమైనా పప్పుచారనుకున్నావా నోట్లో వేసుకొని చెప్పడానికి? కెమికల్స్ క్వాలిటీ కంట్రోల్ చేయడానికి రకరకాల పరీక్షలు వుంటాయి. ఇంటర్‌మీడియెట్‌లో కెమిస్ట్రీ లేబ్‌లో ఎనాలిసిస్ చేయలే? కొంచెం అలాగే వుంటుంది."

"ఇంటర్‌లో చదివిన కెమిస్ట్రీ అప్పుడే మరిచిపోయా నేనూ!"

"సరే, నా సంగతి సరే, నువ్వు చెప్పు. పీహెచ్‌డీ ఎలా సాగుతోంది?"

"బాగా సాగుతోంది. ఇంకా ఏ విషయం మీద రీసెర్చి చేయాలా అన్నదే తేల్చుకోలేకపోతున్నాను."

"అంటే?"

"సాహిత్యం అంటే వుత్త పుస్తకాలూ, నవలలే కాదు. సాహిత్యంలో రీసెర్చ్ చేయడానికి ఎన్నో వివిధ రకాలైన అంశాలుంటాయి. అంటే, ఆంగ్ల సాహిత్యంలో రీసెర్చి అంటే, మనం ఒక కాలానికి సంబంధించిన సాహిత్యం గురించై వుండొచ్చు, లేదా ఒక కాలంలో విరిసిన సాహితీ సృజనలోని శైలి గురించి అయి వుండొచ్చు, అనువాద సాహిత్యం గురించై వుండొచ్చు, భాషకీ, అభివ్యక్తికీ, సంస్కృతికీ కల సంబంధాల గురించై వుండొచ్చు. ఇలా స్థూలంగా చూసినా చాలా శాఖలు కనిపిస్తాయి. ఏదో ఒక శాఖని ఎన్నుకున్న తరవాత అప్పుడు ఆ శాఖలో ఒక అంశాన్ని ఎన్నుకోవచ్చు."

"అసలు అభివ్యక్తి అంటే ఏమిటి?"

" అభివ్యక్తి అంటే ఎక్స్‌ప్రెషన్."

"మరి నువ్వే శాఖలో చేద్దామనుకుంటున్నావ్?"

"నేనా? నాకు అనువాద సాహిత్యం గురించి రీసెర్చి చేద్దామనుకుంటున్నాను. నా స్నేహితురాలొకామె తెలుగు సాహిత్యంలో రావూరి భరద్వాజ గారికీ, హిందీ సాహిత్యంలోని ప్రేంచంద్‌కీ గల స్వారూప్యాల గురించి రిసెర్చి చేస్తూ వుండేది. అలాటి టాపిక్కైన బాగుంటుంది."

"నువ్వు చెప్పిన ఇద్దరు రచయితలూ నాకు తెలియదు!"

"హిందీ సాహిత్యం వొదిలేయ్ కానీ, తెలుగూ, ఇంగ్లీషు పుస్తకాలు చద్వడం మొదలు పెట్టొచ్చుగా?"

"పెట్టొచ్చనుకో, కానీ నాకు బొమ్మలే లేని పుస్తకాలు చదవడం బోరు కొడుతుంది. అదే చందమామో, టింకిలో, లేదా కామిక్స్ అయితే చదవొచ్చు. చిన్నప్పుడు టిన్‌టిన్, ఆస్టెరిక్స్ కామిక్స్ భలే ఇష్టంగా చదివేదాన్ని. అంతే కానీ ఏ బొమ్మలు లేకుండ ఇంతింత లావు నవలలు, నా వల్ల కాదు దేవుడోయ్!"

"నీదంతా చిన్న పిల్లల తంతు భానూ!" నవ్వుతూ లేచి నిలబడ్డాడు అశోక్.

ఇద్దరూ సీఫెల్ కాంటీన్ వొదిలి బయటికొచ్చారు. డిసెంబర్ నెల ఎండ వెచ్చగా వుంది. క్రిస్మస్ సెలవులు కావడంతో కేంపస్ అంతా ఖాళీగా వుంది.

"సరే, అయితే నువ్వు ఒక మంచి తెలుగు పుస్తకమూ, ఒక మంచి ఇంగ్లీషు పుస్తకమూ ఇవ్వు. అయితే అవి లావుగా వుండ కూడదు మరి. చదివి ఇచ్చేస్తాను."

"ఇస్తాలే. ఇంతకీ మిగతా సెలవులంతా ఏం చేస్తున్నావ్?"

"సెలవులా? మీరంటే యూనివర్సిటీలో చదువుకునే పిల్లలు, మీకు సెలవులుంటాయి. మాలాటి వర్కింగ్ పీపుల్‌కి సెలవులేంటి? ఇవాళ వూరికే సెలవు పెట్టాను. సోమవారం మళ్ళీ ఆఫీసుకెళ్ళాలి."

"అదీ నిజమేలే. మా జూనియర్ కాలేజీకి కూడా సెలవులు కాబట్టి నేను హాయిగా తిరుగుతున్నాను."

"సరే, మళ్ళీ ఎప్పుడు మనం కలవడం?"

"సూసీ క్రిస్మస్ పార్టీకొస్తావుకదా?"

"వీలవుతుందో లేదో చెప్పలేను అశోక్. మా కంపెనీ తరపున బాడ్మింటన్ టోర్నమెంట్‌లో పార్టిసిపేట్ చేస్తున్నాను. ఇరవై అయిదో తారీకు పగలంతా బాడ్మింటన్ ప్రాక్టీస్. సాయంత్రానికి ఎలా వుంటానో ఏమో!"

"అబ్బా! ప్లీజ్, రా భానూ. నువ్వు లేకపోతే నాకు చాలా బోర్ కొట్టేస్తుంది."

"సరే, చూస్తాలే. అంత బేలగా మొహం పెట్టకు మరి. అదిగో ఆ ఆటో ఆపు, ఇంటికెళ్ళాలి."

★★★★★★★★★★★★★★★★★★★★★★★

సూసీ, శివా వాళ్ళ పోర్షన్ లైట్లతో అలంకరించబడి వుంది. హాలు మధ్యలో చిన్న క్రిస్మస్ ట్రీ,బల్ల మీద డిన్నర్ సామాగ్రీ సర్ది వున్నాయి.

శివా, అశోక్, వెంకట్, విజయ్ డిన్నర్ ప్లేట్లూ, మంచి నీళ్ళూ, సర్ది పెడుతున్నారు.

"నువ్వు చీర కట్టుకొని తయారయే సమయానికీ, మేమూ ఇల్లంతా సర్దటానికీ ఒకే సమయం పట్టింది సూసీ!"

" అంటే, నేను డ్రస్ చేసుకోవడానికి చాలా టైం తీసుకుంటున్నాననా?"

"ఎహె, కాదు! మేం చాల తొందరగా ఇల్లంతా సర్దేసామని అర్థం!" విజయ్ సర్ది చెప్పాడు.

"అసలు, చీర కట్టుకోవడం ఎంత కష్టమో మీకేం తెలుసు? ఏదో పైనొక షర్టూ, కిందొక పాంటూ తగిలించుకోవడం కాదు, ఆడ పిల్లలు తయారు కావడమంటే!" సూసీ ఉడుక్కుంది.

ఇంటి ముందు ఆటో, బైకూ ఆగిన చప్పుడయింది. ఆటోలోంచి కోమలీ, భానూ దిగారు. బైకు మీద అశోక్ వొచ్చాడు.

"వార్నీ! కొత్త బైకు, భలే వుందిరా అశోక్! ఎప్పుడు కొన్నావ్?"

"రెండు వారాలైంది. ఆరు నెల్ల స్టైపెండూ, కాలేజీ జీతం అన్నీ ఊడ్చేస్తే వొచ్చింది!"

అందరూ కేకు తింటూ, టీ తాగుతూ కబుర్లలో పడ్డారు.

"రావేమో అనుకున్నాను. బాడ్మింటన్ ప్రాక్టీసు ఎలా జరిగింది?" ఒక మూల భాను చేతిలో కేకు పెట్టి అన్నాడు అశోక్. ఆ రోజు కనకాంబరం రంగు మీద ముదురు ఆకుపచ్చ రంగు ప్రింటున్న గార్డెన్ చీరలో కొత్తగా అనిపించింది భాను అతని కళ్ళకు.

"టుడే యూ లుక్ డిఫరెంట్", అన్నాడు.

"అది కాంప్లిమెంటా, లేక క్రిటిసిసమా?"

"అఫ్ కోర్స్ కాంప్లిమెంట్. యూ లుక్ వెరీ ప్రెటీ!"

"థాంక్ యూ!" తేలిగ్గా నవ్వేసినా, ఆమె చెంపలు ఎర్రబడ్డాయి.

"అశోక్, జనవరి నెల అంతా నేను బెంగుళూర్ వెళ్తున్నాను."

"అవునా? దేనికి? ఎప్పుడు వెళ్ళాలి? మళ్ళీ ఎప్పుడొస్తావ్?"

"ఒక వారం బాడ్మింటన్ పోటీలు. ఆ తరవాత రెండు వారాలు ఒక టెక్నికల్ ట్రెయినింగ్. ఇంకొక వారం అందరం కలిసి బెంగుళూరు చుట్టు పక్కలంతా చూసి వద్దామనుకుంటున్నాం."

"అలాగా? బాగా ఎంజాయ్ చేయి. రాగానే ఫోన్ చేయి. బెంగుళూరు నించి ఉత్తరాలు కూడా రాస్తూ వుండు."

"ఏమిటి? నెలరోజులకే ఉత్తరాలా? సరే, రాస్తాలే. " నవ్వుతూ అంది భాను.

"మీరిద్దరూ ఆ గోడ దగ్గర గుస గుసలాపి కొంచెం ఇటొచ్చి మాతో కూర్చుంటారా?" కోమలి గట్టిగా అన్నది.

"గోడ దగ్గర గుస గుసలా? ఏదో చవకబారు తెలుగు సినిమా టైటిల్‌లాగుంది!" కూర్చుంటూ అన్నది భాను.

"అది సరే, ఇవాళ పాటలూ, ఆటలూ లేవా?" శివా అన్నాడు.

"అంత్యాక్షరి ఆడదాం!" అశోక్ మాటలకి అందరూ సరే అన్నారు. ఆ తరవాత గంట సేపు కొత్త పాత తెలుగు హిందీ పాటలతో ఇల్లు హోరెత్తిపోయింది. తొమ్మిదింటికి కోమలీ, భానూ ఆలస్యమవుతుందని ఆటోలో బయల్దేరారు.

"అశోక్, వున్న డబ్బంతా పెట్టి బైకు కొన్నానన్నావు. మరి జీతాలందేసరికి ఇంకో వారం రోజులన్నా పదుతుంది. డబ్బేమైనా కావాలా?" భాను బయల్దేరేముందు చిన్నగా అడిగింది.

"థాంక్స్ ఫర్ ఆస్కింగ్! కానీ అవసరం లేదు. నేను ఆ మాట నవ్వులాటకన్నాను. మరీ చేతిలో ఒక్క రూపాయి కూడా లేకుండా చేసుకుంటానా? అమ్మ అసలు డబ్బు తానే ఇస్తాను కొనుక్కోమన్నది, కానీ నాకు అమ్మ సేవింగ్స్ అత్యవసరమైతే తప్ప వాడడం ఇష్టం వుండదు. అందుకని నా దగ్గర వున్న డబ్బే వాడానన్న మాట. బట్, ఐ అప్రీషియేట్ యువర్ కన్సర్న్," బై చెప్తూ అన్నాడు అశోక్.

★★★★★★★★★★★★★

"నువ్వూ అశోక్, ఇవాళ భలే స్పెషల్‌గా తయారై వొచ్చారే!" ఆటోలో అన్నది కోమలి.

"స్పెషల్ ఏముందే? మామూలుగానే వున్నా కదా?"

"నువ్వు మామూలుగా అనుకున్నా, చూసే వాళ్ళకి మీరిద్దరూ ఒకరికొకరు స్పెషల్ అని తెలుస్తూనే వుందిలే!"

"అవునా? మేమిద్దరమూ మామూలుగానే వున్నట్టనిపిస్తుంది."

"ఏమో మరి. మాకందరికైతే మీ ఇద్దరికీ మనసుల్లో సంథింగ్ సంథింగ్ అనిపిస్తుంది," భానుని ఉడికించింది కోమలి.

"ఒప్పుకుంటా, నాకు అశోక్ అంటే ఇష్టమే. అయితే ఆ ఇష్టాన్ని ఎంత దూరం తీసుకెళ్ళొచ్చో, అసలతని మనసులో ఏముందో మాత్రం నాకు అర్థం కావడంలేదు."

"డోంట్ వరీ, నిర్ణయించుకోవడానికేమీ తొందరపడకు. అతను అన్ని విషయాల్లోనూ చాలా స్థిరమైన అభిప్రాయాలు వున్న వాడిలా అనిపిస్తాడు. వచ్చే సంవత్సరం అతన్ని ఇంకొంచెం దగ్గరగా గమనించు. మీ ఇద్దరికీ ఏ మాత్రం సరిపడని విషయాలేమిటో కనుక్కో. అప్పుడు ఒక ఐడియా వొస్తుందేమో!"

"అలా చేయడానికి ముందు అతనేం అనుకుంటున్నాడో నాకు తెలియాలి కదా? లేకపోతే నా పరిస్థితి ఎంత అసహ్యంగా వుంటుంది!"

" ఆ విషయంలో నీకు అనుమానం అవసరం లేదనుకుంటా. అతను నీ వైపు చాలా ఇష్టంగా చూస్తాడు, నా అభిప్రాయం ప్రకారం."

"వాట్? నేనెప్పుడూ గమనించనేలేదు!"

"అవును. ఏమైనా, అతని ఉద్దేశ్యం కన్‌ఫర్మ్ చేసుకో."

"ఎలా?"

"ఆ, అది మాత్రం నాకు తెలియదు. అందుకే నేను ఈ విషయాల్లో తల దూర్చదలచుకోలేదు!"

"అంటే?"

"అంటే,నేను హాయిగా నా పెళ్ళి విషయం అమ్మా నాన్నలకే వదిలేయ దలచుకున్నాను."

"అయ్యో, నేనూ అలాగే అనుకున్ననే, రెండేళ్ళ క్రితం వరకూ, అంటే అశోక్‌ని చూసే వరకూ!"

"అబ్బో! నువ్వు బాగా ముదిరిపోయావే!"

ఆటో భాను వాళ్ళ ఇల్లు చేరింది. ఆ రాత్రి భాను వాళ్ళ ఇంట్లో వుండి మర్నాడు వెళ్ళి పోయింది కోమలి.

★★★★★★★★★★★★★★★

1994 జనవరి

డియర్ అశోక్,

ఎలా వున్నావ్?

బెంగుళూరు చచ్చే చలిగా వుంది! పగలంతా బాడ్‌మింటన్ ప్రాక్టీసుతో ఒళ్ళు హూనమైపోతూంది. ఆదివారం ఒక్కరోజు రెస్టు తీసుకుంటున్నాం. సోమవారం నుంచి రెండు వారాలు మా కంపెనీకి సంబంధించిన లేబొరేటరీలో ట్రెయినింగ్. ఆ తరవాత ఒక వారం బెంగుళూరు, మైసూరు, ఇంకా చుట్టుపక్కలంతా తిరిగి చూసొస్తాం.

నా సంగతి సరే. నువ్వెలా వున్నావు? నిన్ను కలిసి పది రోజులే ఐనా చాలా రోజులైనట్టుంది. యూనివర్సిటీకెళ్తున్నావా లేదా? మీ ప్రొఫెసర్ ఏమంటున్నాడు? అమూల్య ఎలా చదువుతోంది? అమ్మని కూడా అడిగినట్టు చెప్పు. అన్నట్టు హేపీ న్యూ ఇయర్. ముఫ్ఫై ఒకటో తారీకు రాత్రి పార్టీ ఎలా జరిగింది? సినిమాలేమైనా చూసావా?

మా టీంలో అందరూ స్నేహంగానే వుంటారు కానీ, ఒక్క ప్రదీప్‌తోనే కొంచెం చిరాకు. ఊరికే ఏదో తనకే అన్నీ తెలుసన్నట్టు ఫోజు కొట్టడం, అతి చనువుగా మాట్లాడడం, నాకు మహా ఇరిటేటింగ్‌గా వుంటుంది. సరే, ఆ సోది వెధవ గురించి ఇప్పుడెందుకు కానీ, నువు అన్ని విశేషాలతో ఉత్తరం రాయి మరి, సరేనా! కింద అడ్రసుకి ఉత్తరం రాయి. కానీ ఇక్కడ ఇంకో రెండు వారాలే వుంటాను.

భాను

డియర్ భానూ,

అబ్బ, నీ వుత్తరం చూడగానే ఎంత హాయిగా అనిపించిందో చెప్పలేను. నువ్వు బెంగుళూరులో సరదాగా గడుపుతూంటే, ఇక్కడ నేనొక్కణ్ణే నిన్ను మిస్సవుతూ, ఇదేం బాగా లేదమ్మాయ్.

ప్రదీప్ గురించి రాసావు, వాడు బహుశా నీకు లైనేస్తున్నాడేమో! నీలాటి ప్రెటీ గర్ల్‌కి లైనేయకుండా ఎవడైనా వుంటాడా చెప్పు? సరదాగా తీసుకొని నవ్వేసి వొదిలేయ్. మరీ ఇబ్బంది పెడితే, అప్పుడాలోచించొచ్చు.

బాడ్మింటన్ ప్రాక్టీస్ సరే, టోర్నమెంట్ ఎప్పుడు? అందరినీ బాదేసి కప్పులన్నీ కొట్టుకురావాలి.

సినిమాలంటే, జెంటిల్‌మేన్ అనే సినిమా చూసాను. రిజర్వేషన్ల గురించి. సినిమా ఏమో కానీ, పాటలు చాలా బాగున్నాయి.

అమూల్య పరీక్షలకని బాగా చదువుతోంది.

అన్నట్టు, నేను గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో లెక్చరర్ పోస్టుకి అప్లై చేస్తున్నాను. వొచ్చే అవకాశం తక్కువేలే. క్రితం సంవత్సరం నా యూజిసి పరీక్షలో మంచి స్కోరే వచ్చింది కదా? ఆ స్కోర్ ఆధారంగానే అప్ప్లై చేసుకోవచ్చు.

ఈ ఎండకాలం తరవాత మా జూనియర్ కాలేజీని డిగ్రీ కాలేజీ చేస్తున్నారు. అయితే, కనీసం ఎంఫిల్ అయినా లేకుండా డిగ్రీ కాలేజీలో లెక్చరర్ పోస్టు ఇవ్వటమా అని మా వాళ్ళకి కొంచెం సందేహంగా వుంది. చూద్దాం ఏమవుతుందో. ప్రస్తుతానికి పీహేచ్‌డీ, కాలేజీ లెక్చర్లతో బాగా బిజీ. అందులోనూ పరీక్షలు దగ్గరకొస్తున్నాయి కదా!

డాన్సు ప్రాక్టీసు మాత్రం అసలు సాగటంలేదు భానూ. అసలు ఏవైనా కార్యక్రమాలుంటే ప్రాక్టీసు చేయడానికి ఉత్సాహంగా వుంటుంది. అకాడెమీలోనేమో చిన్న వయసు వాళ్ళకి ఎక్కువ అవకాశాలు వుంటాయి. ఇప్పుడు నాకై నేను అరంగేట్రం చేసి పెద్ద కార్యక్రమాలు చేసేంత డబ్బు కానీ, సాహసం కానీ నాకు లేవు. ఆ రకంగా చూస్తే సంగీత కళాకారులకి చాలా రకాల అవకాశాలుంటాయి అనిపిస్తుంది. నాట్య కళాకారులకి చిన్న చిన్న ప్రదర్శనలిచ్చే అవకాశం తక్కువ. ఏకంగా పే...ద్ద ఆర్టిస్టులై పోతే తప్ప వేదికలమీద నాట్యం చేసే ఛాన్సు రాదు. మరి అంత పెద్ద ఆర్టిస్టులయేంతవరకూ ఒక్క అవకాశమైనా లేకపోతే ఎలా? నాకు నా డాన్సు తలచుకుంటే చాలా నిరాశగా వుంటుంది. ఎంతో ఇష్టంగా ఆసక్తిగా నేర్చుకున్నాను. ఎవరూ ప్రోత్సహించకపోగా, మగపిల్లాడు డాన్సేమిటని అపహాస్యం చేస్తారు. ఎంతమంది మా బంధువుల్లో నన్ను "ఆడంగి సన్నాసి" అంటారో తెలుసా? మనుషులకి ఇంత అజ్ఞానం, దాన్ని మించిన అహంకారం ఎందుకుంటాయంటావ్? కాకపోతే మరేమిటి? భరతముని రచించిన కళారూపం ఆడంగి విద్యా? అసలు ఆడంగి అనే మాటలోనే ఎంత అవమానం, ఎంత హేళన, ఎంత వికృతత్వం దాగుంది కదా? ఆ మాట మగవాళ్ళకంటే, ఆడావాళ్ళనెక్కువ అవమానిస్తున్నట్టుండదూ?

ఈ గొడవంతా వొదిలేయ్ కానీ నువ్వు బెంగుళూర్, మైసూర్, కూర్గ్ అన్నీ బాగా ఎంజాయ్ చేసి రా. ఫోటోలు బోలెడు దిగు. హైదరాబాద్ వచ్చి రెండు రోజులు రెస్టు తీసుకుని మూడో రోజు సీఫెల్ కాంటీన్ కొచ్చేయాలి. నువ్వు లేకుంటే నాకెలాగో వుంది. శివా కూడా అడిగాడు నిన్న, అంత డల్‌గా వున్నావేంట్రా అని.

వుండనా,

అశోక్.

ఆ వుత్తరం చూసిన భానుకు బెంగుళూరు చల్లని సాయంత్రంలో వేడి టీ తాగుతున్నంత వెచ్చగా అనిపించింది. హైదరాబాదు వెళ్ళగానే అశోక్ ని తన గురించి అతని అభిప్రాయం ఏంటని అడిగేస్తుంది. తనెప్పుడూ అతని కులమేంటన్న విషయం పట్టించుకోలేదు. ఆ మాటకొస్తే తనకి కోమలి, ఆశా వాళ్ళ కులాల గురించి కూడా పెద్ద ఆలోచన లేదు. కానీ ఇప్పుడు అమ్మ అశోక్ కులమేంటని గోల చేస్తుందేమో. చూద్దాం. ఆ సమస్య ఎత్తినప్పుడే ఆలోచిద్దాం. ఇన్నిసార్లూ కలిసి భోంచేసినా, కనీసం అతను శాకాహారో, మాంసాహారో కూడా అడగలేదు. ఇప్పుడీ వివరాలన్నీ కనుక్కోవాలా! ఆమెకి మనసు వికారంగా అయింది. మళ్ళీ మనసుని సంతోషపెట్టటానికి అశోక్ ఉత్తరం తీసి చదవసాగింది. ★★★★★★★★★★★

(కొనసాగింపు వచ్చే నెలలో)

COMMENTS